

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-రాయచోటి

స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహిం చనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకనటలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్పందనకువచ్చిన అర్జీలకు సంబంధించిన పరిస్కారాలు ఎన్ని చేశారనే వివరా లతో అధికారులు రావాలన్నారు. అన్ని శాఖల అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ పాటించాలని పేర్కొన్నారు.

వైసిపి పాలనలో గ్రామాలు నిర్వీర్యం

- పాదయాత్రలో నారా లోకేష్



ఖాజీపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి-చాపాడు/ఖాజీపేట

రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామ సీమలను పూర్తిగా నిర్వీర్యం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 115 రోజుకు చేరుకుంది. ఆదివారం మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలంలోని భూమాయపల్లె విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై ఇంజినీర్‌కొట్టాలు, పేరారెడ్డికొట్టాలు, బుడ్డాయపల్లె, ఖాజీపేట, పత్తూరు, దుంపలగట్టు, కొత్తపేట, చెన్నముక్కపల్లె విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, బలిజలు, రైతులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ సొంత ప్రాంతమైన రాయలసీమలో ప్రజలకు గుక్కెడు నీళ్లివ్వలేని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. గ్రామ పంచాయతీలకు చెందిన రూ.8,660 కోట్లు జగన్ ప్రభుత్వం దొంగిలించడంతో పంచాయితీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధుల్లేవన్నారు. వ్యవసాయంపై అవగాహన లేని వ్యక్తి సిఎం కావడం రాష్ట్ర రైతాంగానికి శాపంగా మారిందన్నారు. జగన్ నిర్వాకం కారణంగా రాష్ట్ర రైతులు అప్పుల్లో జాతీయ స్థాయిలో నెం.వన్‌గా నిలిచారన్నారు..టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.70వేలు ఉన్న రైతుల సగటు అప్పు, జగన్ నాలగేళ్ల పాలనలో రూ.2.5 లక్షలకు చేరిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక గతంలో మాదిరిగా డ్రిప్ సబ్సిడీని పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దళారీల బెడదను నివారిస్తామన్నారు. బలిజలు జగన్ చేతిలో బాధితులుగా మారారన్నారు. రాయలసీమలో బలిజల్ని ప్రభుత్వం అసలు పట్టించుకోలేదని తెలిపారు. తన పిల్లలు విదేశాల్లో చదివితే చాలు పేద విద్యార్థులు విదేశాల్లో చదవకూడదనే ఆలోచనలో విదేశీ విద్య పథకం రద్దు చేశారని విమర్శించారు. గతంలో కాపులకు అమలు చేసిన రిజర్వేషన్ కి మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. టిడిపి రాజంపేట పార్లమెంటు నుండి 12 సార్లు బలిజ వ్యక్తిని పార్లమెంటుకు పంపిస్తే, జగన్ రాజంపేట ఎంపీ సీటును మిథున్‌రెడ్డికి కట్టబెట్టి బలిజలను వంచించారన్నారు. తిరుపతి అసెంబ్లీ సీటును తెలుగుదేశం పార్టీ బలిజలకు కేటాయిస్తే, జగన్ సొంత వర్గానికి కట్టబెట్టాడన్నారని తెలిపారు. బజ వర్గానికి చెందిన సి.రామచంద్రయ్య, సుపులేటి బ్రహ్మయ్య, చదలవాడ కృష్ణమూర్తి, బి.కె.సత్యప్రభ, ఆమె భర్త ఆదికేశవులు నాయుడులకు పలు రాజకీయ అవకాశాలు కల్పించామన్నారు. విద్యా, ఉద్యోగాల కల్పనలో రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ మేరకు 5శాతం రిజర్వేషన్లు ఇచ్చామన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.3100 కోట్లు ఖర్చు చేశామని, ఎన్టీఆర్ విదేశీ విద్యాదరణ పథకం ద్వారా 4,528 మంది కాపు విద్యార్థుల్ని విదేశాల్లో చదివించామని గుర్తు చేశారు. కాపు కార్పొరేషన్ ద్వారా 66.50 కోట్లు రుణాలుగా ఇచ్చామని, 33,594 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చామన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవిని కాపులకిచ్చామని, ప్రతి జిల్లాలో రూ.5 కోట్లతో కాపు భవన్‌లను నిర్మించామని తెలిపారు. జగన్ కాపు కార్పొరేషన్ నిర్వీర్యం చేసి ఒక్క రూపాయి రుణం ఇవ్వకుండా కాపులను ఆర్థికంగా, రాజకీయంగా దెబ్బతీశాడన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో అమలు చేసిన విదేశీ విద్య పథకం, నిరుద్యోగ భృతి మళ్లీ ప్రారంభిస్తామని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించామన్నారు. మీ-సేవ నిర్వాహకుల ఇబ్బందులను గమనించి గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో స్థలాలు ఇచ్చి, కమీషన్ కూడా పెంచామని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ-సేవ కేంద్రాల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు. మీ-సేవ కేంద్రాల ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లను అధికారికంగా గుర్తిస్తామన్నారు. ప్రజలపై పన్నుల బాదుడుపై ఉన్న శ్రద్ధ సౌకర్యాల కల్పనపై లేదన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా పాడైపోయిన రోడ్లపై తట్టమట్టిపోసే దిక్కులేదని తెలిపారు. వైసిపి నేతలు శ్మశానాలను సైతం వదలకుండా ఆక్రమించడం దారుణమన్నారు. పాదయాత్రలో కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు హరిప్రసాద్, ధనపాల జగన్, బిఎన్ శ్రీనివాసులు, దాసరి బాబు, మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, శ్రీరాముల యాదవ్, నరసింహులు యాదవ్, కొంగాని వెంకటసుబ్బయ్య, జెండాల మహబూబ్ బాషా, కమలాపురం ఫరూక్, కమలాపురం గౌస్, శంకర్ నాయుడు, టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- జీపు జాతాలో రాష్ట్ర నాయకులు



రాయచోటి : ప్రచార జాతాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు హామీలను అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన జీపు జాతా ఆదివారం రాయచోటి ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకోగానే మున్సిపల్ కార్మికులు ప్రచార జాతాలోని రాష్ట్ర నాయకత్వానికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన గీతాలు స్థానిక ప్రజానీకానికి ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.లక్ష్మి నారాయణ, బి.గోపి, ఎటిఎం నాగరాజులు పేర్కొన్నారు. ముఖ్య మంత్రి జగన్ ప్రతి పక్షంలో ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై అమీతుమీ తేల్చుకోవడానికి సంసిద్ధమయ్యామని పేర్కొన్నారు. జగన్ ప్రతిపక్షంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టి ఆప్కాస్‌లో చేర్చి చేతులు దులుపు కున్నారని విమర్శించారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీతంలో పెరుగుదల లేదని హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. అరమరిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని రిటైర్ మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని 010 పద్దు కింద జీతాలివ్వాలని ఫనిభారం తగ్గించి అధికారుల వేధింపుల నివారణకు కృషి చేయాలని చెప్పారు. ఇఎస్ఐ, పిఎఫ్ అవకతవకలపై విచారణ జరిపించాలని తెలిపారు. చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. మాస్కు గ్లౌజులు కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వలేదని తెలిపారు. మూడు నెలల హెల్త్ అలవెన్స్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం అధికారులకు తగదని కనీస వేతనం 26 వేలు అమలు చేసే దాకా పోరాడతామని చెప్పారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే వచ్చే ఎన్నికల్లో వారు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. జాతాలో నాయకులు ముత్యాలరావు, నాగేంద్ర, శ్రీనివాసులు, రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగబసిరెడ్డి, మున్సిపల్ కార్మికులు రాంబాబు, అగ్గిరామయ్య, సిద్దయ్య, మంగమ్మ, వెంకట్రామణ, ఓబులేసు, మంగమ్మ, మాధవి, సిఎం.లక్ష్మిదేవి, రమణమ్మ, శంకరయ్య పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై అమీతుమీ తేల్చుకోవడానికి సంసిద్ధమయ్యారని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగేంద్ర బాబు పేర్కొన్నారు. మున్సిపల్ రాష్ట్ర జీపు జాతా ఐదో రోజు బి.కొత్తకోట చేరుకోగా మున్సిపల్ కార్మికులు ప్రచార జాతాలోని రాష్ట్ర నాయకత్వానికి పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. జాతాకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.సురేంద్ర బాబు అధ్యక్షత వహించగా నాగేంద్ర బాబు మాట్లాడుతూ బి.కొత్తకోటలో గుర్తించిన 20 ఏళ్ల నుండి పని చేస్తున్న కార్మికుల జీతాల్లో కానీ జీవితాలలో కానీ మార్పు లేదనీ, ప్రతిపక్షంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టి నాలుగేళ్లయినా కనీసం ఆప్కాస్‌లో కూడా చేర్చకుండా చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు అవుల శ్రీనివాసులు, కె.రామాంజి, సి.రామకృష్ణ, జి.మారతమ్మ, లక్ష్మి నరసమ్మ, గంగులమ్మ, రామ లక్ష్మమ్మ పాల్గొన్నారు. జాతా బి.కొత్తకోట నుంచి చిత్తూరు జిల్లా కుప్పంకు వెళ్లింది.



బి.కొత్తకోట : నగర పంచాయతీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న నాయకులు

పీడితుల పక్షపాతి కేతు విశ్వనాథరెడ్డి

- అరసం జిల్లా అధ్యక్షులు ఆచార్య ఈశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య ఈశ్వరరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

పీడితుల పక్షాన తన కలాన్ని ఝళిపించిన మానవతావాది, అభ్యుదయ భావాలతో సాహిత్యాన్ని సామాజిక శాస్త్రాలతో అధ్యయనం చేసిన గొప్ప కథా రచయిత, విమర్శకుడు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కడపజిల్లా శాఖ అధ్యక్షులు ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి అన్నారు. కేతు విశ్వనాథ రెడ్డి సంస్మరణ సభను అరసం కడపజిల్లా శాఖ, వైవీయూ సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంయుక్తంగా ఆదివారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించాయి. తొలుత వక్తలు, సాహితీవేత్తలు కేతు విశ్వనాథ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరసం కడపజిల్లా శాఖ అధ్యక్షులు ఆచార్య ఈశ్వర రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి తన చుట్టూ ఉన్న సమస్యలను, పుట్టి పెరిగిన ప్రాంత జీవితాన్ని కథలుగా మలచిన విశిష్ట రచయితని కీర్తించారు. ఆచార్య కేతు కథలను రేపటి తరానికి అందించి చదివించగలిగితే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, అదే మనం ఆయనకిచ్చే ఘననివాళి అన్నారు. వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ ఆచార్య కేతుకు విశ్వవిద్యాలయం ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ తెలుగు శాఖకు మార్గదర్శనం చెయ్యడమేకాక గజ్జెల మల్లారెడ్డి అవార్డు ఎంపికలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలసంఘం గౌరవాధ్యక్షులు పి.సంజీవమ్మ మాట్లాడుతూ తనకు ఆచార్య కేతుతో తనకు 1973 నుంచి పరిచయం ఉందని, 1974లో అరసం మొదటి కథాసంపుటాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆయనను రాయలసీమకో, రాష్ట్రానికో పరిమితం చెయ్యకూడదని, ఆయన రచనలు అనేక జాతీయ భాషల్లోకి అనువదితమయ్యాయని చెప్పారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యాన్ని, మార్క్సిస్టు తాత్వికతను ఆయన ఒంటపట్టించుకొన్నారని తెలిపారు. ఆయన మననుంచి దూరం కావడం దిగ్భ్రాంతికరమన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సాహితీ రంగంలో విశ్వనాథ రెడ్డి తనకు మార్గదర్శ కులన్నారు. బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, అరసం ప్రతి ఏటా ఆయన పేరుతో సదస్సులు నిర్వహించి అవార్డులు ఇచ్చేలా చూడాలని కోరారు. ప్రముఖ కథారచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి, డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ, మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, బాసట స్వఛరేద సేవా సంస్థ అధ్యక్షులు యం.బాలాజీ రావు, కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ అధ్యక్షులు లయన్ కొండూరు జనార్దన రాజు, కేతు విశ్వనాథరెడ్డితో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. అరసం కడపజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు స్వాగతం పలికారు. ఒడిస్సా రైలు దురెటన మృతుల ఆత్మశాంతికి సభ మౌనం పాటించింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కెస్కో సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, ప్రముఖ కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్, జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటీ చీఫ్ ప్యాట్రన్ లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగా సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజగోపాలరెడ్డి, డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, హాజరతయ్య, కుమారస్వామి రెడ్డి, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగా సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాజగోపాలరెడ్డి, డాక్టర్ తక్కోలు మాచిరెడ్డి, హాజరతయ్య, కుమారస్వామి రెడ్డి, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి పాల్గొన్నారు.



రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

చుక్కల సమస్యలకు.. చక్కటి పరిష్కారం :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూముల సమస్యకు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చక్కటి పరిష్కారం చూపించారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో చుక్కల భూముల రైతులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4026 మంది రైతులు చుక్కల భూముల సమస్యతో బాధపడ్డారని, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చుక్కల భూముల రైతులు పడుతున్న ఇబ్బందులను గమనించి చుక్కల భూములకు చక్కటి పరిష్కారం చూపారన్నారు. దీంతో చుక్కల భూములను సైతం రిజిస్టర్ చేసుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, రఘు, అబ్దుల్ కలీమ్, శివా రెడ్డి పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఒరిస్సా రాష్ట్రంలోని బాలాసోర్ ప్రాంతంలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి, బాధ్యతా రాహిత్యమైన మోదీ ప్రభుత్వ విధానాలలే కారణమని విడుదలై చిరుతైగల్ కట్చి (విసికె పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేల ప్రైవేటీకరణకు పునుకొని శాశ్వత ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేసిందని, తత్కారణంగా రైల్వే శాఖలో ఉద్యోగుల కొరత ఎక్కువై, ఉన్న ఉద్యోగులకు పనిబారం పెరిగిందని చెప్పారు. సంపన్నుల సౌకర్యం కోసం వందేభారత్ లాంటి రైల్లు వేస్తున్నారు గాని, సామాన్య జనం నిత్యం ప్రయాణించే జనరల్ బోగిలను, స్లీపర్ కోచ్‌లను పెంచలేదని దీంతో రైల్లు జనంతో కిక్కిరిసిపోయి, రైలు ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే మన రైళ్ళు ఘోర ప్రమాదాలు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. బాలాసోర్ రైలు ప్రమాద దుర్ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విఆర్ విత్ యు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బోయినపల్లిలోని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సుమారు 35 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కూడు, గూడు, గుడ్డ అనే ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. మున్ముందు కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నితిన్, నాగార్జున, రేష్మ భాను, హేమంత్, వేణు, ముక్తియార్, చరణ్, త్రివేణి, జాహ్నవి, వినయ్, లోహిత్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు



పతకాలు సాధించిన క్రీడాకారులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని అడ్వకేట్ కొండూరు శరత్ కుమార్ రాజు, లాయర్ ఆర్.నాగప్రసాద్, ఉపాధ్యాయులు ఓబులేష్, డాక్టర్ సునీల్, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ పేర్కొన్నారు. ఆదివారం ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టైక్వాండో ఛాంపియన్ షిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యానికి, చురుకుదనానికి క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వలన ఆత్మవిశ్వాసంతో ఆత్మ రక్షణ మెలువలు నేర్చుకోవడంతోపాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి అలవాటు పడతారని అన్నారు. శారీరక ద ృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా లభిస్తుందని అన్నారు. క్రీడల లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటాతో విద్య, ఉద్యోగాలలో కూడా అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడలలో కూడా రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అన్నమాచార్య పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులురాజశేఖర్, అంజన్ కుమార్, ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్లు ఆర్ ఎన్ రెడ్డి ప్రవీణ్, ఉద్దండపు బాలాజీ, శివ, వికాష్, భాను, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ గంగారామ్ తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సుమారు 140 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన గిరిరావు దివ్యజ్ఞాన పాఠశాల (జీఆర్టీ హైస్కూల్) పూర్వ వైభవానికి కృషి చేద్దామని పాఠశాల కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు పద్మారాణి పేర్కొన్నారు. ఆదివారం పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనకు విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో మనకు ఒక స్థానాన్ని ప్రసాదించిన మన పాఠశాలలో మనం మళ్ళీ కలుసుకోవడం చాల సంతోషాన్ని కలిగిస్తున్నదన్నారు. 1865వ సంవత్సరం వినాయక చవితి పర్వదినాన జన్మించిన రాయచోటి గిరిరావు తన 23వ ఏట 1988 ఉగాది పండుగ రోజు మహోన్నత ఆశయాలతో ఈ పాఠశాలను స్థాపించారన్నారు. పూర్వ విద్యార్థులు,దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి విరాళాలు విరివిగా అందించాలన్నారు. మీరు విరాళంగా యిచ్చే ప్రతి రూపాయ పాఠశాల అభివృద్ధి కోసమే వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.పద్మారాణి మరియు ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు, దాతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరెస్పాండెంట్ ప్రసాదరావు

గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం గ్రామదేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన విశేష అలంకరణలతో పూజలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. గంగాజలాలతో మహిళలు ప్రదర్శనగా పురవీధుల్లో తిరిగి స్థానిక బజారు వీధి, నాయక్ వీధి ప్రాంతాల్లోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మన్ రాంకుమార్ రెడ్డి, సభ్యులు కేశవ రెడ్డి, బలరాం, విజయవర్మ, రవి, మహేష్, శివ, పూజారి జనార్ధన్, మాజీ జడ్పీటీసీ చింతల శివానంద రెడ్డి, ఆర్‌బికె చైర్మెన్ నీళ్లభాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

వల్లూరు : ఏరువాక పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి మహాక్షేత్రంలో తలపెట్టిన గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు పుష్పగిరి ధర్మ పరిరక్షణ సేన నిర్వాహకులు, ఇంటెక్ లైఫ్ టైం మెంబర్ సట్టి భారవి పేర్కొన్నారు. ఆదివారం పుష్పగిరి దేవస్థానంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భక్తులు అత్యధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొని గిరి ప్రదక్షిణను విజయవంతం చేశారన్నారు .జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేషంగా పాల్గొని తమ మొక్కుబడులను స్వామివారికి సమర్పించుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల నుంచి మరింత విశేష స్పందన ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అల్పాహారం, నీళ్ళు,మజ్జిగ అడుగడుగునా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి సహకరించిన స్థానికులు సునీల్, విశ్వనాథరెడ్డి, కాల్వ భాస్కర్ రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, తాడిగొట్ల వెంకట సుబ్బారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పుష్పగిరి క్షేత్ర ధర్మ పరిరక్షణ సేన సభ్యులు, జగన్మాత మారెమ్మ ఆలయ సభ్యులు భాస్కర, సత్యనారాయణ, బాలకృష్ణ, వరప్రసాద్ ,నాగేంద్ర స్వామి, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి కేశప్ప తెలిపారు. మదనపల్లి ట్రాఫిక్ విభాగానికి ఎస్పీ 20 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించారని, సిబ్బంది అందరూ కూడా సమయపాలన క్రమశిక్షణ పాటించి ట్రాఫిక్ విధులను సక్రమంగా పాటించాలని ప్రధాన ప్రాంతాలలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఎలాంటి అవినీతికి పాల్పడ రాదని విధి నిర్వహణలో టర్న్ అవుట్ కలిగి ఉండి అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పట్టణంలో ఎవరైనా విఐపిలు పర్యటించే సమయంలో కానీ న్యాయమూర్తులు ప్రయాణించే వారు బెంగుళూరు రోడ్డు కోర్టు పరిసర ప్రాంతాలలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. వేసవికాలం దృష్ట్యా ట్రాఫిక్ సిబ్బందికి ఆయన ఎండ వేడిని తట్టుకునేందుకు గాను ప్రత్యేకమైన టోపీలను అందజేశారు. వేసవి దృష్ట్యా సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఆరోగ్యంగా ఉండాలని ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అవుట్ పోస్ట్ ఇన్‌ఛార్జి ఎఎస్‌ఐ రెడ్డప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

ఒడిస్సా రాష్ట్రంలోని బాలాసోర్ సమీపంలో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద కుటుంబాలను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలని దళిత బహుజన స్టూడెంట్ స్టూడెంట్ బద్దె భాను ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం అయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఒడిస్సా రాష్ట్రంలోని రైలు ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను, క్షతగాత్రులను ప్రచార మాధ్యమాల్లో చూస్తుంటే గుండె తరుక్కుపోతూందన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు కారణమైన రైల్వే అధికారులను తక్షణమే సస్పెండ్ చేసి, మ ృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మహేష్ రాజు, శశి, గోపి పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు మండలంలో ఉన్నటువంటి పది ప్రభుత్వపాఠశాలల్లో 2023 సంవత్సరానికి గాను పదవతరగతి పరీక్షలలో ఉత్తీర్ణులైై ఆయా పాఠశాలలో ప్రథమశ్రేణి మార్కులు పొందిన విద్యార్థులను తగురీతిన సత్కరించి భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు చదువులో ముందుకు రావటానికి ప్రేరణగా ఉండాలని ఆదివారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ రీజనల్ కో-ఆర్డినేటర్ మన్నెం రామమోహన్ ఆధ్వర్యంలో చీఫ్ కన్సల్టెంట్ సౌత్ సెంట్రల్ రైల్వే డాక్టర్ జయభాస్కర్‌రావు, అధ్యక్షతన ముఖ్య అతిథిగా ధీరజ్ కుమార్ హాజరై విద్యార్థులు వి.సాయి కీర్తన (పాటూరు జడ్పీ హైస్కూల్, నందలూరు), నజీయా (నందలూరు ఉర్దూ స్కూల్) ఎ.సంధ్య (జడ్పీ హైస్కూల్, నందలూరు), ఉమామహేశ్వరి (నల్ల తిమ్మాయపల్లె స్కూల్), వై.లక్ష్మీ రమణ (లేబాక స్కూల్) ఎస్. ఇందు (ఆంగ్లూరు స్కూల్) యు.అంజలి (పొత్తపి స్కూల్) ఆర్.త్రివేణి (ఆడపూరు గురుకుల పాఠశాల), ఎస్.బిందు, బి.కృష్ణ లీలావతి (బిసి రెసిడెన్షియల్ స్కూల్,నందలూరు) బి. లోకేశ్వర్ (జడ్పీ హైస్కూల్,నాగిరెడ్డిపల్లి) లను శాలువా లతో సత్కరించి జ్ఞాపికతో పాటు యండమూరి వీరేంద్రనాథ్ రచించిన విజయరహస్యాలు పుస్తకాలు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా బి.ధీరజ్‌కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యలో రాణించాలంటే పట్టుదల, క్రమశిక్షణ తో ప్రణాళిక బద్ధంగా చదవాలని ఎట్టి పరిస్థితుల్లో ఒత్తిడికి లోనుకాకుండా ముందుకు వెళ్లే విజయశిఖరాలు అందుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కుర్రాకుల యాదవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు, శ్యామసుబ్బయ్య గురుప్రసాద్, మోడపోతుల రాము, కొత్తపల్లి, రాజాచారి, గాడి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గాలివీడులో గడప గడపకూ..

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలిగల్లు, తూముకుంట గ్రామపంచాయతీలో సోమ, మంగళ, బుధ వారాల్లో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శేఖర్‌నాయక్ తెలిపారు. సోమ, మంగళవారం వెలిగల్లు గ్రామాల్లో, బుధవారం తుమ్మెద గ్రామపంచాయతీ లో నిర్వహించే గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీకార్యకర్తలు హాజరు కావాలని తెలిపారు.

నేడు వేరుశనగ విత్తన కాయల పంపిణీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని రైతులకు సోమవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ ఆధారంగా రైతులు వేరుశనగ పంటను సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను ఎమ్మెల్యే రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 12 సచివాలయాలకు కె6 (తెల్లరకం) 819 క్వింటాలు, నారాయణి 900 క్వింటాలు మొత్తం 1719 క్వింటాల వేరుశనగ విత్తన కాయలు రైతులకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కేఓక్స్ట్ ఐస్తా రూ.1674లు, నారాయణి -రూ.1773లు సబ్సిడీ ధరకు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. దయం గం.10 లకు నిమ్మనపల్లి సొసైటీ కార్యాలయం వద్ద వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అన్నారు. మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, స్థానిక రైతులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు, ఆర్‌బికె కమిటీ సభ్యులు పాల్గొనాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

సంక్షోభంలో కూరుకుపోయిన అన్నదాతలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో గత నాలుగేళ్ల వైసిపి పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం టిడిపితోనే సాధ్యమని అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఈ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో రైతులకు అన్నదాత పథకం, మహిళలకు మహాశక్తి పథకం, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి పథకం, బిసిలకు రక్షణచట్టం, పేదలను సంపన్నులు చేయడం అదేవిధంగా ఇంటింటికి మంచినీరు పథకాలను మహానాడు వేదికగా టిడిపి మేనిఫెస్టోను అత్యంత అద్భుతంగా ప్రకటించారని అన్నారు. వైసిపి పాలనలో కౌలు రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగినేని వెంకటరమణ, మాజీ సర్పంచ్ గడికోట సుబ్బరాయుడు, రాజంపేట పార్లమెంట్ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు తేనేపల్లి చిన్న, రామయ్య పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే బిజెపికి అడ్డుకట్ట

ప్రజాశక్తి - బి.కొత్తకోట

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతోన్మాద, ఫాసిస్టు శక్తికి అడ్డుకట్ట వేయాలంటే కేవలం ప్రజా పోరాటాల ద్వారానే సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పేర్కొన్నారు. సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక కార్యాలయం నందు ఆ పార్టీ నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.ఎల్.నరసింహులు మాట్లాడుతూ బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నలలో దేశాన్ని పరిపాలిస్తున్న బిజెపి,మణిపూర్ రాష్ట్రంలో మత ఘర్షణల చిచ్చుపెట్టి వందలాదిమంది ప్రజల ప్రాణాలను బలికొ న్నదని, హిజాబ్ సమస్యను లేవనెత్తి ముస్లింలలో అభద్రతా భావాన్ని రెచ్చగొట్టి హిందూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నదని విమర్శించారు. కడప- బెంగళూరు (వయా మదనపల్లి) రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, గత ఏడాది భారీ వర్షాలకు తెగిపోయిన పింఛా, అన్నమయ్య ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో ఎస్.బషీర్‌ఖాన్, అష్రఫ్‌అలీ, కె.అంజనప్ప, ఎస్.తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ..!

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని పెద్దినేని కాలువ, బండకాడ ఈడిగపల్లి గ్రామ ప్రజలు గ్రామంలో గత నెల రోజులుగా నీటిసమస్యతో ఇబ్బందులు పడుతున్నామని నీటి పరిష్కరించి తమ దాహార్తిని తీర్చాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు. తాగునీటి బోరు పనిచేయక పోవడంతో మరమ్మతులు చేసేవారే లేరని ఆవేదన చెందారు. ఈ విషయం పైన అధికారులు మాత్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. అధికారులు, ప్రజాపతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. గ్రామంల నాగారపమ్మ జాతర జరుగుతుండటం తో ప్రజలు నీటి సమస్యతో అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు నీటి మోటరుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



మరమ్మతులకు నోచుకోని నీటి మోటర్

సుండుపల్లికి తాగునీరు వచ్చేనా..?

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో దాదాపు 14 గ్రామ పంచాయతీలకు తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో రోళ్ళమడుగు వాటర్ స్కీం నుంచి సుండుపల్లి వరకు గత టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులను చేపట్టింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పనులు కూడా ప్రారంభించి పైపులు లైన్ పనులను కూడా పూర్తి చేశారు. జెసిబిలతో చిన్న గొల్లపల్లి వరకు గుంతలు కూడా తీయడంతో ప్రజలు తాగునీటి కష్టాలు తీరుతాయని ఆశపడ్డారు. కానీ టిడిపి ప్రభుత్వ హయాంలో పనులు పూర్తి కాలేదు. అనంతరం వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పైపులైను ఏర్పాటు చేసిన తర్వాత మధ్యలోనే పనులను ఎందుకు ఆపాల్సి వచ్చిందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుక వెళితే పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందు తున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి ట్యాంకర్‌ను కూడా ఏర్పాటు చేశారు. పనులు పూర్తయ్యి ట్యాంకర్‌లోకి నీరు ఎప్పుడు చేరుతుందోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. వేసవి తీవ్రత ఎక్కువుగా ఉండటంతో తాగునీటి సమస్య తీవ్రమైందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి చేసిన పనులు వృధా కాకుండా పెండింగ్ పనులను పూర్తి చేసి మండల ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.



రోళ్లమడుగు నీళ్ల ట్యాంక్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మండలానికి రాళ్లమడుగు నీళ్లు వచ్చాయంటే ఎలాంటి తాగునీటి సమస్య ఉండదు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు వెంటనే సమస్య పరిష్కరిం చడానికి కృషి చేయాలి. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- గొల్లపల్లి నాగరాజా, జి.రెడ్డివారిపల్లి

వేసవి శిక్షణ శిబిరాలతో చిన్నారుల అల్లరికి బ్రేక్



శిక్షణ పొందుతున్న చిన్నారులు

టివి, సెల్ ఫోన్‌కు దూరంగా చిన్నారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వేసవి సెలవులు వస్తే పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ఏ వీధిలో చూసినా చిన్నారుల ఆట పాటలు, కేరింతలతో సందడిగా ఉండేది. ఆట పాటలు శృతిమించి తల్లిదండ్రులకు భారంగానూ మారేది. పిల్లల అల్లరిని భరించలేక పాఠశాలలు తిరిగి ఎప్పుడు పునః ప్రారంభమవుతాయా అని ఏ నోట విన్నా పెద్దల నుంచి ఈ మాటలే వినబడేవి. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి పిల్లలు నేర్చుకున్న నాలుగక్షరాలు కూడా మరచిపోయి అవస్థలు పడేవారు. కానీ రోజులు మారాయి. తల్లిదండ్రుల ఆలోచన ధోరణి కూడా మారింది. సెలవులు వృధా కాకుండా తమ పిల్లల్ని వేసవి శిక్షణా శిబిరాలలో చేర్పించి పిల్లల అభ్యున్నతికి పాటు పడుతున్నారు. ఆత్మరక్షణ విద్యలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి వివిధ కళలలో తమ పిల్లలకు శిక్షణ అందించి వేసవి సెలవులను విజ్ఞానదాయకంగా మార్చుకుంటున్నారు. పట్టణంలో శివ డ్యాన్స్ అకాడమీ, ఎఆర్ డాన్స్ అకాడమీ ద్వారా సంగీతం, నృత్యం, కరాటే, చిత్రలేఖనం వంటి కళలలో శిక్షణ ఇస్తున్నారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, ఏకలవ్య మార్షల్ కాడమీ లు ఆత్మరక్షణ విద్యలైన తేక్వాండో, కుంగ్ ఫు, కర్రసాము వంటి విద్యలను వేసవి శిక్షణ శిబిరం ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రతి అకాడమీ లోనూ పిల్లలు పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు పొంది శిక్షణ పొందుతున్నారు. ప్రతి ఏడాది రాజంపేట పట్టణంలో ఈ శిబిరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. వేసవిలో 45 రోజుల పాటు ప్రతిభావంతులైన సుశిక్షితులచే శిక్షణ ఇవ్వడం, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ద తీసుకోవడం వలన తల్లిదండ్రులు కూడా వేసవి శిక్షణ శిబిరాలపై మక్కువ చూపుతున్నారు. దీంతో పట్టణంలో వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది.

పిల్లల ఆరోగ్యం కోసమే..



కనీసం వేసవి సెలవులలోనైనా మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొంది ఆత్మ రక్షణ మెలుకువలు తెలుసుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్న ఉద్దేశ్యంతో ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో వేసవి శిక్షణ శిబిరంలో నా ఇద్దరు పిల్లల్ని చేర్పించాను. అకాడమీలో శిక్షణ బాగుం డడంతో వేసవి సెలవులలో మాత్రమే కాకుండా వారిని అలాగే కొనసా గించాలని నిర్ణయించుకున్నాను. ఈ ఏడాది వేసవి సెలవులు వృధా కాకపోవడంతో సంతో షంగా ఉంది.

- రాజేశ్వరి (గృహిణి, ఈడిగపాలెం)



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని బురకాయలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు దేశ విదేశాలలో స్థిరపడి, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ స్థిరపడినవారు ఆదివారం ఆత్మీయసమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థుల కలయిక తదనంతరం పాఠశాల అంతా కలియతిరిగి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అందరూ కలుసుకొని విందు భోజనాలు ఏర్పాటు చేసుకొని సంపంగి భోజనాలు చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రామకృష్ణ రాజులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటేష్, గుత్తికొండ త్యాగరాజు, సిపి.రమణారెడ్డి, మంగరాజు, లక్ష్మన్న, షేక్షావలి, రఘు, జయరాంరెడ్డి, బాబు, సంధ్యారాణి, శశికళ, రెడ్డమ్మ, సునంద, నిర్మల, లీలావతి, ప్రమీల పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు ఈస్ట్ కోస్ట్ రైల్వేస్, భువనేశ్వర్‌లో ఇంటర్న్‌షిప్ ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఒక నెల పాటు ఈ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటారని అన్నారు. రైల్వేస్ జరిగే పనితీరును, అందులో వాడే పరికరాలపై ఈ విద్యార్థులు పనిచేస్తారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ ముప్పా లక్ష్మణరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ ద్రుపద్‌వర్మ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గొర్రెల కాపరికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పెద్దపాల్యం గ్రామానికి చెందిన గొర్రెల రైతు ఎస్. అల్లాబకాష్ గామ సమీపంలో గొర్రెలు మేపుతుండగా ఇటీవల కురిసిన వర్షానికి పిడుగుపాటుకు 15 గొర్రెలను కోల్పోయి నష్టపోయారని తెలుసుకున్న రిట్ కో-డిస్టలరీస్ అధినేత డి.జయచంద్ర రెడ్డి రైతును పరామర్శించి అతనికి రూ20 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం మండలంలో వేపూరికోట దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరామాలయ నిర్మాణమునకు గ్రామస్తులకు రూ.25వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మంత్రి గిరిధర్‌రెడ్డి, పాలగిరిసిద్ధ, శంకర్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

పుల్లంపేటలో విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఉత్తలూరు వడ్డిపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుల్లంపేట మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి సతీమణి ముద్దా పెద్ద విజయమ్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్రబోలు శివకుమార్ రెడ్డి, ఆలయ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసిపి నాయకుని మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- కలకడ

వైసిపి నాయకుడు సింగర కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ కొత్తగాండ్లపల్లికి చెందిన సింగర కృష్ణయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువత

బైక్ ర్యాలీలో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలో ఆదివారం టిడిపి నాయకులు చమర్తి జగన్ మోహన్ రాజు పర్యటించి గ్రామంలో వెలసివున్న అంకాల పరమేశ్వరిదేవి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పట్టణం నుంచి ఊటుకూరు వరకు టిడిపి మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, విష్ణువర్ధన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, సాంబారు లక్ష్మీనారాయణ, వేల్పుల బాల, మలిశెట్టి కిరణ్, ఉప్పలపాటి సుబ్రహ్మణ్యం రాజు, శ్రీనివాస రాజు, గణేష్ రాజు, శివప్రసాద్ రాజు, సాయి వర్మ, కరుణాకర్ రాజు, శేషారెడ్డి, విజయకుమార్ నాయుడు, కొమ్మి సాంబ శివయ్య నాయుడు, వెంకటేష్ యాదవ్, నాగేంద్ర, ఎన్టీఆర్ కాలనీ జెల్లీ దుర్గ, సూర్యనారాయణ రాజు, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో చిన్నారుల విజ్ఞాన్ని పెంపొందేందుకు పోటీలు నిర్వహించామని చెప్పారు. కథలు రాయడం, చిత్రలేఖనం గీయించడం వంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలో విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని బర్తరఫ్ చేయాలి

కడప : బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మహిళలకు రక్షణ కల్పించలేని బిజెపి సర్కార్ వెంటనే దిగి పోవాలని అన్నారు. దేశం కోసం నిరంతరం మహిళా రేజర్లు కష్ట పడి , భారత దేశం కోసం ఎన్నో పతకాలు సాధించిన మహిళా రెజర్లు పైన బ్రీజ్ భూషణ్ లైంగికంగా వేధిస్తున్నారని ఆందోళన చేస్తుంటే మోడీ ప్రభుత్వం కనీసం సిగ్గు లేకుండా చూసి చూడనట్లు ఉండటం దారుణం అని అన్నారు. కోరికలు తీర్చమని, అసభ్య కరంగా, శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని రెజ్లర్లు పేర్కొంటున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు.

దాడులు చేస్తున్నా పట్టించుకోరా?

కడప అర్బన్ : కమలాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో నిజాయితీగా పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలపై వైసిపి నాయకులు తీవ్రస్థాయిలో దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడినా తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టించుకోరా అని టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సాయినాథ్ శర్మ సూటిగా ప్రశ్నించారు. టిడిపి కార్యకర్త జనార్దన్ రెడ్డిపై వైసిపి నాయకుల దాడిని నిరసిస్తూ కమలాపురం నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి సాయినాథ్ శర్మ ఆదివారం గాయత్రి టవర్స్ నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నారా లోకేష్ పాదయాత్ర కొనసాగుతున్నప్పటికీ, వైసిపి శ్రేణులు టిడిపి కార్యకర్తలపై దాడులు చేసి హతమార్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ జిల్లాలో తెలుగుదేశం నాయకుల్లో ఏమాత్రం స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ముందుగా దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనార్దన్ రెడ్డిని సాయినాథ్ శర్మ పరామర్శించారు.



గ్రంథాలయంలో పుస్తక పఠనంలో విద్యార్థులు

వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

జిల్లా గ్రంథాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం చేయాలని కడప జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రామాపురంలోని శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మే నెల 6వ తేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలు కళాశాలలు సెలవులు ఇచ్చిన దృశ్య వారి సమయం వృధా కాకుండా ఉండేందుకు స్థానికంగా ఉన్న గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఇలా వినియోగించుకోవడం వల్ల విద్యార్థుల మేధాశక్తి పెంపొందించుకోవడమే కాకుండా సమయం వృధా కాకుండా పుస్తక పఠనం చేసినట్లు అవుతుందని చెప్పారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు పనికి వచ్చే పుస్తకాలతో పాటు ప్రతిరోజూ దినపత్రికలు మేగజైన్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వేసవి శిక్షణ శిబిరాల్లో ప్రతిరోజు ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్థానిక గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చేందుకు అలవాటు చేసుకోవడం ఎంతో మంచిదని గతంలో చాలామంది గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదువుకొని ఉన్నత స్థాయి అధిరోహించిన వారు ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పలు రికార్డులు తనిఖీ చేశారు. గ్రంథాలయానికి వచ్చిన పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు గ్రంథాలయానికి రావాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో బత్యాల చెంగల్రాయుడు

వైసిపి పాలన రైతులకు శాపం : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

వైసిపి పాలన రైతులకు శాపంలా మారిందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని తాళ్లపాక గ్రామపంచాయతీ పరిధిలో రైతులతో ఏరువాక పౌర్ణమి నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి అనేది రైతులకు తొలి పండుగని, రైతు సేద్యానికి నాంది పలికే రోని అన్నారు. ఏరువాక పౌర్ణమి అని వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు పంటకు అణువుగా భూమిని చదును చేస్తారని అన్నారు. టిడిపి హయాంలో రైతులకు పండుగగా ఉండేదని వైసిపి పాలనలో రైతుల పాలిటి శాపంగా మారిందన్నారు. రైతుల పేరు చెప్పి అప్పులు తెచ్చారని అప్పులు ఎక్కువగా కలిగిన రైతులు ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నారంటే మన రాష్ట్రంలోనేనని అన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులు పండించిన పంటకు పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, చెరువుల్లో కుంటల్లో నీళ్లున్న రైతులు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు ఎక్కువగా ఉండటంతో పండించేందుకు విముకత చూపుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

కాలువలో పోవాల్సిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. గోరాన్ చెరువు పంచా యతీ గేటు వద్ద నుంచి పెద్ద చెరువు వరకు కాలువను తీశారు. వాటికి పూడ్చక పోవడంతో మురికి కాలువ నిండిపోవడంతో నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈదారిన వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి రోడ్డుపై పోతున్న మురికి నీటిని కాలువలోకి మళ్లించడానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మండలంలో జాతరల సందడి

ప్రజాశక్తి కలికిరి

మండలంలోని గుట్టపాలెంకస్పాలో పాలేటిగంగమ్మ, గుండ్లూరు కస్పాలో మూలస్థాన ఎల్లమ్మఅమ్మవారి జాతరలు వైభవంగా నిర్వహించారు. గుట్టపాలెంలో వెలసిన శ్రీపాలేటమ్మ అమ్మవారి జాతర దొరవారి వంశీయులచే కలిసస్థాపనతో మొదలై శాంతి పూజలు నిర్వహించారు. తర్వాత ఎల్లంపల్లి మగసాని వంశీలచే సిద్ధపూజ నిర్వహించి 11 గంటలకు దొరగారి నగిరి బోనం సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి పరిసర ప్రాంతాల వారు వివిధ దువ్వెలు బోనాలు సమర్పించారు. సాయంత్రం 6 గంటల నుంచి జంగంపల్లి ఆసాధి వారిచే అమ్మవారి కథ కాలక్షేపం నిర్వహించి అక్కడికి విచ్చేసిన భక్తులను కనువిందు చేశారు. అలాగే గుండ్లురు మూలస్థానమ్మ జాతర సందర్భంగా ఉదయం ఐదు గంటలకు దేవస్థానం ధర్మకర్తల ఆధ్వర్యంలో సాంప్రదాయపద్ధంగా అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. రాత్రి చాందిని బండ్లతో అమ్మవారి గుడి చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలోని పలు గ్రామాలలో శనివారం, ఆదివారం గంగ జాతర వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అగ్రహారం పంచాయతీ రెడ్డివారి పల్లి, బండమీదపల్లి లో నలివీర గంగమ్మ, పోలేరమ్మ జాతర, వెంగంవారిపల్లి లో , నిమ్మనపల్లి పంచాయతీ దేవళం కురవపల్లిలో , తవళం పంచాయితీ ఎగువ పల్లిలో గ్రామ దేవత అమ్మవార్ల జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అగ్రహారం పంచాయతీ నలివీర గంగమ్మ ఆలయ ధర్మకర్త శ్రీనివాసులరెడ్డి ఆహ్వానం మేరకు గంగజాతర వేడుకలలో మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, రామారావు, ఖాసిం, ఎర్రయ్య, గడ్డం నరసింహారెడ్డి, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్ గొల్లపల్లి నుంచి అరుంధతి వాడకు వెళ్లే రహదారి మధ్యలో అరిటాకులు కోసుకునే వ్యక్తి రోడ్డుపై బైక్ పెట్టి అరటి తోటలోకి వెళ్లి ఒక గంట సమయం లో తిరిగి వచ్చి చూసుకునేసరికి బైక్ చోరీకి గురైందని దాసరి నవీన్ తెలిపారు. బైక్‌చోరికి గురి కావడం జరిగిందని నవీన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాసి ఇవ్వడం జరిగింది. అనుమానాస్పదంగా ఉన్న మోటారు వాహనాలను తనిఖీ చేసి విచారించి, నవీన్ కి తెలియపరుస్తామని ఎస్ఐ రఘురాం తెలిపారు.